భాషల ప్రాచీనగ్రంథములతో తెలుగు కావ్యములను సమీక్షచేసి పక్షపాతరహితుడైన ఏ విదేశీయుడైనా ఒప్పించవచ్చును. తిక్కనయొక్క తియ్యదనమునకు పోతన్న భావుకత్వ మాధుర్యమునకు, శ్రీనాథ కవితా కళానైపుణ్యమునకు ముగ్ధులు కానివారెవ్వరు? ప్రాచీన సాహిత్యప్రేరణతో మనం ఆధునికమైన తెనుగును సకలవిషయ సమృద్ధముగా చేసికొనవలెను. ముందుగా మన భాషలోని లోటు తెలిసికొనడమునకు ప్రయత్నించవలెను.

* * *

ముఖ్యముగా శాస్త్రీయ గ్రంథాభావమే తెలుగుభాషకున్న లోటు. గణితం జ్యోతిషం, విజ్ఞానం, పదార్థతత్వజ్ఞానం మొదలగు విషయములు సాహిత్యంలో చేరకపోవచ్చు. పాఠకుల నానందప్రవాహంలో తన్మయులను కావించకపోవచ్చును. కానీ యీ నాడు ఏభాషలోనైన శాస్త్రీయగ్రంథములు లేకున్న అది మృతభాషతో సమానమేగదా. నేడు తెలుగుమాత్రమే తెలిసిన పాఠకునకు ప్రపంచంలోని శాస్త్రీయ, సాహిత్యక విషయములను కూలంకషముగా తెలిసికొనుటకు సాధ్యపడకపోవచ్చును ఇతర ప్రాంతములలోని శాస్త్రీయ విషయనిపుణులు ఎక్కువగా తమ ప్రాంతీయభాషల్లోనే శాస్త్రీయగ్రంథములు రచింతురు. కొన్నిభాషల్లో సాహిత్యగ్రంథములతో సమానముగా శాస్త్రీయగ్రంథములున్నవి. ఆంధ్రదేశములోని ప్రొఫెసర్లంతా వైజ్ఞానికవిషయములను సామాన్యపౌరుడుకూడా తెలిసికొనుటకు వీలుగా ఆంధ్రభాషలోనే విజ్ఞానగ్రంథ రచనకు పూనుకొనవలెనని నా మనవి. దేశాభివృద్ధికి నేడు శాస్త్రీయ జ్ఞానమే అత్యవసరమైనది.

పాశ్చాత్యదేశములలో వైజ్ఞానికవిషయములు పిల్లలకుకూడా గ్రాహ్యమయ్యేట్లుగా అనేక వైజ్ఞానిక గ్రంథములు రచించబడినవి. అక్కడ బాలురుకూడా వాటిని ప్రేమతో చదువుదురు. మనం వైజ్ఞానిక విషయజ్ఞానమునకై ఆంగ్లగ్రంథములపైననే ఆధారపడియుండడం శోచనీయమైనది. ఆంగ్లంలో వ్రాయబడిన న్యూటన్ సిద్ధాంతములు డార్విన్ పరిణామవాదము మొదలగు విషయములను తెలిసికొనడం వాటిని మననంచేయడం స్వల్పాంగ్లజ్ఞాతలైన విద్యార్థులకు కష్టముగా ఉండును. సామాన్యవిజ్ఞాన సూత్రములనూ, నూతనావిష్కారములనూ తేలికగా తెలియజేయు గ్రంథములు నేటి ప్రజానీకమున కెక్కువ అవసరం.

**ఏప్రిల్ నెల శ్రీ ఆరోగ్యసుధ పత్రికలో ప్రకటింపబడిన 'సూర్యకాంతి—మానవుని ఆరోగ్యం' అనే వ్యాసంలోనుంచి :**

సూర్యకాంతియే భూమిమీద సప్తవర్ణకారకమైవుంది.

అనేక రోగకారకక్రిముల్ని నాశనం చేయడంలో సూర్యకాంతి అమోఘమై వుంది.

ఆరోగ్య పరిరక్షణకు సూర్యకాంతి అత్యంతమూ అవసరమై వుంది.

సూర్యకాంతి బాగా తగలని పిల్లలు ఏపుగా ఎదగరు. వాళ్ళ శిరస్సు పెద్దదైవుండి యెముకపుష్టి కొరవడి వుంటుంది. పుష్కలమైన సూర్యకాంతి కొరవడిన తావుల్లోవుండే యౌవనవంతులకు కూడా క్షయరోగం తగలడానికి హెచ్చు అవకాశంవుంది. క్షయరోగకారక క్రిముల్ని, డిప్తీరియా క్రిముల్ని సూర్యకాంతి చంపగలిగేటంత సమర్థంగా చంపగలిగినవస్తువు ప్రపంచంలో మరొటిలేదని పాశ్చాత్యశాస్త్రవేత్తలు పరిశోధనలు జరిపి నిరూపించివున్నారు.

కాబట్టే సూర్యకాంతి పుష్కలంగావుండే వేసవి రోజులు మంచి ఆరోగ్యప్రదమైనవనడం. ఈ రోజుల్లో గృహసమస్య, వస్త్రసమస్యలు పేదవారికే అంత పీడాకరంగా వుండవంటే సామాన్య సంసారులసంగతి చెప్పనక్కరేలేదు.

అన్ని కాలాలకంటె వేసవి ఆరోగ్యప్రదమైంది. 'వేంఢ్రాన్ని గురించిమాత్రమే ప్రజలు కొంచెం విసుక్కుంటారు.' అన్నాడు ఒక అనుభవవైద్యుడు.

వేంఢ్రంయొక్క తీవ్రతను సాధనాంతరాలతో తగ్గించుకుంటే వేసవి అంత ఆరోగ్యప్రదమైనకాలం మరి ఒకటి లేదు.

**సుప్రసిద్ధ చరిత్ర పరిశోధకులు శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మగారు తెలుగు స్వతంత్ర (22-4-49) లో 'రహస్యాలు వెల్లడించే రాళ్లు' అనే వ్యాసంలో ఇట్లు వ్రాస్తున్నారు:**

మీరు నమ్మినా నమ్మకపోయినా రహస్యాలు చెప్పే రాళ్ళు ఉన్నమాట నిజం. అత్యంత పురాతన సామ్రాజ్యాల చరిత్ర రహస్యాలను వందలకొద్దీ, వేలకొద్దీ సంవత్సరాలుగా కడుపులో పెట్టుకు దాచుకొని వాటిని



http://www.maganti.org/

తెలుసుకోవాలనే తీవ్రమయిన ఆస్థగల విజ్ఞాన పిపాసువుకు వాటిని వెల్లడిచేయాలనే శాసనపు రాళ్ళు. ఉన్నవి —మీరు నమ్మండి, నమ్మకపోండి.

యుగయుగాలనుండి వసుంధరను రక్తపంకిలం కావించి రణయజ్ఞభూమిని మానవమారణహోమం చేసిన దురాశాపాతకపు కాలాలలో, విప్లవపు సామ్రాజ్య విలయ తాండవములలో, అదివరకున్న వ్యవస్థలను తారుమారు చేసి దేశస్వరూపాన్ని, రాజ్యాల రూపురేఖలను మార్చివేసిన పరివర్తనదశలలో వివేచనాపరుడూ వితర్కశాలీ అయిన విజ్ఞాన అన్వేషకుడు ఎప్పుడు కనబడునా, గత యుగాలనాటి మానవ చరిత్రజ్ఞాన రహస్యాలను ఎప్పుడు మూగనోటితో వర్ణించి చెపుదామా, ఈ భారమెప్పుడు తొలగించుకొందామా అని ఒంటికాలిమీద నిలిచి యుగయుగాలనుండి తపస్సుచేస్తూ అర్రెత్తి చూస్తూఉన్న తాపసిరాళ్ళు ఉన్నవి. మీరు నమ్మండి నమ్మకపోండి. అట్టి శిలలను వెలయించిన రాజన్యులు, మహారాజులు మటుమాయమయినారు; అట్టి శిలలకు మెరుగులు దిద్దిన శిల్పులు దివంగతులయినారు; ఆ శిలలమీద బీజాక్షరములవంటి లిపి సంకేతములు చెక్కి వాటికి ప్రాణప్రతిష్ఠ చేసి వాటిని "శిలాక్షరములు" చేసిన అమర లేఖకులు కీర్తిశేషులయినారు: ఆ యత్యంత పురాతన కాలంనాటి రాజ్య, సంఘ వ్యవస్థలకు, విజ్ఞాన సంపత్తికి వాటిని సాక్షీభూతములు కావించిన చిన్న సంస్థానములు, రాజ్యములు, సామ్రాజ్యములు కూడా కథావశేషములైనవి. ఇక, ఆ పురాణ ల రాజ్యవైభవాదులను, మానవ సంస్కృతి సభ్యతలను, ఆనాటివారి ఉపాస్య దేవతలను_ సమస్తమూ తెలిసికొన కుతూహలం గల విచారణశీలి, మానవ విజ్ఞాన పరిణామ దిదృక్షువు ఉంటే తెలిపేటందుకు ప్రాణాలు గుప్పిట బెట్టుకొని నిలిచియున్నవి ఆ మూగి జీవాలే. కాలం రాటుపోటులకు తట్టుకొని దానిని ధిక్కరించి నిలిచిన రాకాసి రాళ్ళు. ఇట్టి రాళ్ళలో కూడా యుగయుగాలనాటి విశ్వసంరంభములో, మానవ జీవితపు ఉచ్ఛపతనములలో ఉల్లోల కల్లోలములలో, మానవుని అజ్ఞానానికీ దుష్ప్రకృతికీ దౌర్జన్యానికీ లొంగిపోయి ఎన్ని, చారిత్రక తంతువును అరచేతబెట్టుకు కాపాడిన ఆ రక్షక శిలలు ఎన్ని నలిగి నాశనమయినవో! ఉన్నవయినా నిండు సౌభాగ్యముతో చెక్కుచెదరక చూడ ముచ్చటగా ఉన్నవా యంటే అదీ లేదు: వాటిలో అనేకాలు కాళ్ళు విరిగినవి కొన్ని, చేతులు విరిగినవి కొన్ని, తలలు విరిగినవి కొన్ని, మొలలు విరిగినవి కొన్నీని. అయినప్పటికీ విజ్ఞాన రహస్య అన్వేషకుని ఆస్థా, ప్రజ్ఞా అనుపమానమయినవి. అత్యధికమయినవి. అపారమయినవి; అతడు రహస్యం పట్టియిచ్చే అటువంటి శిలలు లభించినప్పుడు తన రెండు కనులను వేయి కనులు చేసుకొని సహస్రాక్షుడై, ఆ శిలాహృదయపు లోతులకంటా తన వాడి విమర్శకపు చూపులను ప్రసరింపజేసి పరిశీలించి, వాటి మీది ఒక్కొక్క చుక్క, ఒక్కొక్క వంకర, ఒక్కొక్క వంపు, ఒక్కొక్క సొంపు సాంతమూ గాలించి శోధిస్తాడు: ఆ ముగ్ధశిలలు మూగినోముపట్టి తెలిపిన జాడలను హార్దముగా స్వీకరించి సహస్రపాదుడై అన్వేషిస్తాడు. ఆ విజ్ఞానాన్వేషణ దీక్ష, తెలుసుకోవాలనే అంచులు దాటి పొర్లి ప్రవహించే కుతూహలము, అలపు సొలపులు, విసుగు వేసటలు, విధివిరామములు ఎరుగని సంతత కృషి ఉన్ననాడుకాని కీలకపు శిలలయినా తమ పెదవులు విప్పవు: ఆ విజ్ఞానాన్వేషకుని దీక్షను పుటానబెట్టి కఠినంగా కాకల దేర్చి పరీక్షించి కాని తాము యుగయుగాలనుండి, శతసహస్రాబ్దాలనుండి తమ గుండెలలో పదిలముగా పెట్టుకొని ప్రాణప్రదంగా దాచుకొన్న ఆ రహస్య సౌభాగ్య విశేషాలను బయలుపెట్టవు. అటువంటివి ఆ మొండిశిఖండి గండశిలలు- వట్టి నల్లశాణపు రాళ్ళే, రాపాషాణాలు. సుత్తి తీసుకొని వాటిని చావ జితుకగొట్టు, అవి రెండు చెక్కలవుతవి, తునాతునకలుగా పగులనైనా పగులుతవి కాని చచ్చినా వాటి రహస్యాలు మాత్రం బయటబెట్టవు. వాటిని తర్జించి ప్రయోజనం లేదు, మచ్చికచేసుకోవాలిగాని; వాటిమీద కోపించి ఉపయోగం లేదు, వాటిని లాలించాలి; వాటిని కసరికొట్టి కార్యం లేదు, వాటిని హృదయానికి హత్తుకొని ఉబ్బించాలి; వాటితో ఆడుకోవాలి, మమేక మవాలి. అప్పుడు కాని శిలాహృదయం ద్రవించదు, రహస్య విశేష కథనానికి గొంతుక విడదు. రహస్యాలు వెల్లడిచేసే అటువంటి రాళ్ళు, రాపాషాణాలు లేకేమి, ఎన్నో ఉన్నవి, ఇట్టివి ఇదివరకే బయలుపడినవి, ఇంకా బయలుపడవలసినవి, ఉన్నవి, ఎన్నెన్నో.

ఇటువంటి రాళ్ళు దొరకడంవల్లనే శతశతాబ్దాలక్రితము, సహస్రాబ్దాలక్రితమే కాలపురుషుని ఇనుపదండము తీవ్రాఘాతానికి భగ్నమయి కూలిపోయి చదునయి మట్టిలో కలిసిపోయిన మహాసామ్రాజ్యాల ఉదంతము మనకిప్పుడు క్రమక్రమంగా కొంచెం కొంచెము తెలియవస్తూ ఉన్నది. ఒకానొకకాలంలో ఈజిప్టు, బాబిలోనియా, అస్సీరియాలవంటి మహాసామ్రాజ్యాలు, వాటికాలంలో





http://www.maganti.org/

చాలా గొప్పవి. వర్ధిల్లినవన్న విషయం ఈ శాసనపు రాళ్ళు వెల్లడిచేసిన రహస్యాలను అనుసరించి తెలిసినది కావి. ఎవ్వ రెరుగుదురు అటువంటివి ఒకప్పుడు ఉండేవవి. ఈనాటివా ఇప్పటివా ఆ సామ్రాజ్యాలు. అప్పటికింకా మహమ్మదు ప్రవక్త ఉద్భవించలేదు. ఇస్లాము మతం ఆవిర్భవించలేదు; ఏసుక్రీస్తు జన్మించలేదు. క్రైస్తవం ఒక మతసంప్రదాయముగా వెలయనే లేదు. ఏనాటి మాట యిది. ఇప్పటివా ఆ నష్టసామ్రాజ్యాలు. నాలుగైదువేల సం॥రాల కింకా పూర్వపువే; మానవుని సభ్య కార్యకలాపానికి ప్రథమ క్రీడారంగములయి తనర్చిన రాజసపు సీమలు. ఆ రాజ్యాలు నిర్మించిన రాజులూ చనినారు. ఆ రాజ్యాల సీమావధులను కత్తి పదునుతో పెంపొందించి మహాసామ్రాజ్యాలుగా మలిచిన ప్రతాపాఢ్యులయిన మహారాజులూ గతించినారు. కానయితే వారు నిర్మించిన నగరాలు, కట్టించిన కట్టడాలు భూగర్భితములయినవి, త్రవ్వగా త్రవ్వగా పురాతత్వ జిజ్ఞాసువు పారకు గునపమునకు తగిలినవి; వారు చిత్రములయిన వింతలిపులతో లిఖించిన లేఖనములు గల రాజశిలలు ఉన్నవి. కాని ఆనాటి ప్రజలూ లేరు. ఆనాటి జాతులూ లేవు. ఇంక ఆ లిపులు విడదీయగలవారెవ్వరు, అందులో ఈనాటివీ ఆనాటివీనా ఏనాటివో ఆ లిపులు. వింతలయిన లిపులు. చిత్రలిపులు! ఒక్కతీరా, ఒక్క రకమా?

మన హిందూదేశంలోనే ఉన్నవి నేడు రకరకాలయిన లిపులు. తమిళుల లిపి వేరు. ఆంధ్రుల లిపి వేరు, ఉత్కళుల లిపి వేరు- ఇట్లా లిపులు నేడే మన దేశంలోనే ఎన్నో ఉన్నప్పుడు ఒక లిపికి మరొక లిపికి ఎంతో భేదం ఉన్నప్పుడు ప్రపంచములోని లిపులు ఎన్నెన్నో రకాలయినవనీ, ఒకదానికీ ఇంకొకదానికీ అందూ పొందూ లేదనీ వేరే చెప్పవలెనా? దేశాని కొక లిపి. జాతికొక లిపి. ఈ లిపులలోకూడా పూర్వపు కాలానికి పోతూ వచ్చినకొద్దీ ఎంతెంతో మార్పు కనబడుతుంది. ఎక్కడికో వెళ్ళడమెందుకు. దృష్టాంతానికి మనం ఇప్పుడు వ్రాస్తున్న లిపినే, మన ఆంధ్రదేశంలో వాడుకలో ఉన్న లిపినే తీసుకొని చూస్తే ఇప్పటికి వెయ్యిసంవత్సరాలకు పూర్వం ఉన్న మన లిపిని మనం చదవలేము; ఎంతో వ్యత్యాసం ఉంది ఇప్పటి లిపికీ అప్పటి లిపికీని; రెండువేల సంవత్సరాలనాడు మన దేశంలో వాడుకలో ఉన్న లిపిని మనం పోల్చుకోనేలేము. గుర్తుపట్టనేలేము; ఇది మన లిపేనా మన అక్షరాలేనా అనుకొంటాం. ఆ విధంగానే ఒక్కొక్క జాతి లిపులు, ఒక్కొక్క దేశం లిపులు పూర్వానికి పోయినకొద్దీ ఎంతో మారుతూ వచ్చినవి. ఇటువంటి లిపులు వ్రాసే జాతులే అంతరించిపోయినవి కొన్ని; ఆ కారణంవల్ల ఆ లిపులు కూడా వాడుకలో వ్యవహారంలో అంతరించి పోయినవి. ఇక అంతరించనివల్లా ఆనాటి శిలమీద చెక్కిన లిపులే. కాని ఏమి కార్యం? అని బ్రహ్మ లిపులే అయి పోయినవయ్యె!

పురాతన చరిత్రగల ప్రతిదేశంలోను, పూర్వం ఔన్నత్యం పొందిన ప్రతిజాతికి ఉన్నవి ఇటువంటి లిపులున్న రాళ్లు; ఆ రాపాషాణాలమీది వ్రాత విడదీయడం అంటే మాటలా? పోనీ. ఈనాటి లిపులను పోలినవయినా గనుకనా ఆ లిపులు? అవి బొమ్మలు కొన్ని. వంకరటింకర గీతలు కొన్ని. కీలము అనగా మేకుల వంటివి కొన్ని—రకరకాలు; మనిషి ప్రజ్ఞను, ధీశక్తిని ధిక్కరించి కాలదన్ని వెక్కిరించే వెంగలి లిపులు!

అయినా మనిషి ప్రజ్ఞకు. మనిషి సంతతకృషికి, మనిషి బుద్ధికుశలతకు సాధ్యంకానిది ఏముంది? మనిషి పుట్టుకతోనే విజయశీలి. ఈ రహస్యం గుర్తించినవాడే మనిషి. ఇటువంటి మనిషి పుట్టినాడనగానే ప్రాకృత శక్తులు అతనికి దాసోహమని జోహారు లర్పిస్తని. మనిషి శక్తిసామర్థ్యము లటువంటివి. అటువంటివారికే ఈ ప్రపంచం. నీరసులకు కాదు, నిర్వీర్యులకు కాదు, నిరుత్సాహపరులకు కాదు, నిరాశావాదులకు కాదు, అటువంటి మనిషే ఈ సృష్టికంతకు మేటి కిరీటం. కార్యాచరణానికి దీక్ష వహించి పూనుకొన్నట్టయితే మనిషి ప్రజ్ఞ ఎప్పుడు మొక్కవోయింది? అతని వివేచనా పటిమ, వివేకపటిష్ఠత ఎప్పుడు రాణించలేదు? ఆ బ్రహ్మ లిపులు విడదీయాలనే గాఢమైన కుతూహలం రేగింది. ఆ లిపిజ్ఞానాన్ని గూర్చిన తపన రగిలి రాజుకొన్నది మనిషి హృదయంలో. అంతే కీలకం దొరికింది; లిపులు చిక్కువిడినవి.



http://www.maganti.org/

Source: Press Academy Website, Kinnera Patrika 1949

**Disclaimer:** This topic/article/write-up has been posted here to increase the availability of some rare, forgotten and precious material for appreciation by a wider audience and with no intention what so ever of copy right violation.

Request for removal of any copyrighted material, by the owner, will be promptly complied with.

Maganti Vamsi Mohan